యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే: సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం

నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు – తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9059548848

హైదరాబాద్. | ఎడిటర్:- వై. రమ నాగరాజు | సంపుటి:-32 | సంచిక:-220 | ఆదివారం 04-10-2026

సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

- సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ
- బెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ
- కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి
- రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తు,- మిగతా 2 లో

పాఠశాలల్లో అల్పాహార పథకం
సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల

పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం భారతరత్న మాత్రమే

- భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్య అన్న వీహెచ్
- భారతరత్న ఇవ్వడం ద్వారానే ఆయనకు నిజమైన గౌరవం లభిస్తుందని వ్యాఖ్య

పింగళి సేవలను మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అని ప్రశ్న భారత జాతీయ పతాకాన్ని - మిగతా 2 లో

ఇద్దరు పాక్ చొరబాటుదారులను
కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు

- పంజాబ్ సరిహద్దులో ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులు హతం
- టార్న్ టారన్ జిల్లాలో చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్
- హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో కాల్పులు జరిపిన దళాలు

పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన

చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది

- బొగ్గు కుంభకోణం కేసు క్లీన్ చిట్‌పై సోనియా గాంధీ
- మన్మోహన్ పై రాజకీయ దుష్ప్రచారాలకు తెరపడిందన్న సోనియా
- విచారణ కోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని స్వాగతించిన సోనియా
- సీబీఐ, ఈడీ వంటి సంస్థలను రాజకీయాలకు వాడుకుంటున్నారని మండిపాటు

బొగ్గు బ్లాకుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ - మిగతా 2 లో

గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు
- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- వివక్ష లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ

హస్త కళాకారులకు
అండగా ప్రభుత్వం

- హస్త కళాకారులకు నాణ్యమైన కలప సరఫరాపై పవన్ సమీక్ష
- కేవలం నిర్వహణ ఖర్చులకే కలప అందించాలని ఆదేశం
- రాష్ట్రంలోని ఆరు ప్రాంతాల్లో క్రాఫ్ట్ వుడ్ బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు
- దళారుల వ్యవస్థను నిర్మూలించి, కళాకారులకు అండగా నిలవడమే లక్ష్యం

రాష్ట్రంలోని సంప్రదాయ హస్తకళాకారులకు అండగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక - మిగతా 2 లో

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

- టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాల విక్రయాన్ని ఆపాలని వినతి
- ఇది విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు తొలి అడుగని ఆందోళన
- కాంగ్రెస్ జాతీయ విధానాలకు ఇది విరుద్ధమని లేఖలో ప్రస్తావన
- ప్రైవేటీకరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న ట్రాన్స్‌కో

తెలంగాణలోని కీలక విద్యుత్ రంగ సంస్థల్లో

పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ
జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

- జాతీయ సగటును మించి ఏపీ ఆర్థిక వృద్ధి నమోదు
- 2025-26లో 9.9 శాతానికి చేరిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు
- వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి
- ఎల్ నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు ఆందోళన
- సంక్షోభంలోనూ 15% వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశం

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పథంలో పయనిస్తోంది. జాతీయ వృద్ధి రేటును అధిగమించి, వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రం మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (+జీఎస్‌డీపీ) వృద్ధి రేటు 9.9 శాతానికి చేరుకున్నట్లు జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రణాళికా విభాగం

ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారింది

- ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్ర వ్యాఖ్యలు
- అమెరికా ఆర్థికమంత్రి వ్యాఖ్యలపై మండిపడ్డ ఇరాన్

లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పుడల్లా ఆంక్షల అస్త్రాలను ప్రయోగిస్తోందని మండిపాటు

ఆంక్షల బెదిరింపులతో తమను లొంగదీసుకోలేరని వ్యాఖ్య



ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలపై, ముఖ్యంగా తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించడం అమెరికాకు ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిపోయిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంక్షల ద్వారా ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం'- మిగతా 2 లో

యుద్ధ నేరాల కేసులో సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు మరణశిక్ష

- బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష
- అసద్ తమ్ముడు మహెర్‌కూ అదే శిక్ష
- సమీప బంధువు అతీఫ్ నజీబ్‌కూ మరణశిక్ష
- యుద్ధ నేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనల నేరాలపై తీర్పు
- చిన్నారుల హత్య, హింసతో దోషిగా తేలిన నజీబ్

సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష విధించారు. 14 ఏళ్ల సిరియా అంతర్యుద్ధం సమయంలో జరిగిన యుద్ధ నేరాలు, మానవ హక్కుల హననానికి సంబంధించిన కేసులో ఆయన్ను దోషిగా తేల్చిన కోర్టు కఠిన- మిగతా 2 లో

ఇద్దరు పాక్ చొరబాటుదారులను కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు

మొదటిపేజీ తరువాయి - ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన దళాలు, ముందుకు రావొద్దని వారిని హెచ్చరించాయి. అయితే, పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిని ఇంకా అధికారికంగా గుర్తించలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడండి

41/13లో రెండు ఎకరాల ఐదు గంటలు మార్కెట్ విలువ 300 కోట్లు..

ఖానామేట్ భూములను సర్వే చేయండి..

అధికారులు స్పందించకుంటే ఎమ్మార్వో ఆఫీస్ ముట్టడి

పానుగంటి పర్వతాలు సిపిఐ రాష్ట్ర సమితి

శేరిలింగంపల్లి నవంబర్ 3 నిలువుటద్దం ప్రతినిధి: శేరిలింగంపల్లి మండల పరిధి కానమెట్ సర్వేనెంబర్ 41 /13.లో ప్రభుత్వ భూమి రెండు ఎకరాల 5 గుంటలు కబ్జా చేసిన వాళ్లపై ల్యాండ్ గ్రాఫింగ్ కేసు నమోదు చేయాలని అందులో ఉన్న. కబ్జాకు ప్రయత్నించిన రేకులు సీకులను.తొలగించి ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పోలీసు నిగా ఉండే విధంగా ఎమ్మార్వో తక్షణమే చేయాలని సిపిఐ శేరిలింగంపల్లి నియోజకవర్గ కమిటీ కోరింది..! కామెంట్ ప్రభుత్వ భూములను సర్వే చేసి ఎవరు ఎంత భూమి కబ్జా చేసింద్రు ఎంత భూమి మిగులు ఉంది. సమగ్ర విచారణ జరిపి వాటిని కాపాడుటకు హైడ్రా సహకారం తీసుకొని ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.కబ్జాకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలి. రెండు రోజులలో చేయకపోతే శేరిలింగంపల్లి మండలం తహసీల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున సిపిఐ కార్యకర్తలతో ఆఫీస్ ముట్టడి చేస్తామని తెలిపారు. డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసినారు. ఈ కార్యక్రమంలో పానుగంటి పర్వతాలు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే. చందు యాదవ్ శేరిలింగంపల్లి మండల సీపీఐ కార్యదర్శి కే వెంకటస్వామి డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు.బి నారాయణ సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

అనంతగిరి ఘాట్‌లో విషాదం..

నిరుపేద కుటుంబాల్లో తీరని శోకం

బస్సు బోల్తా ఘటనపై బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.. క్షతగాత్రుల వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి.......

హైదరాబాద్, అక్టోబర్ 03, నిలువుటద్దం ప్రతినిధి: వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపిందని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు తీవ్రంగా గాయపడటం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందిన వివరాల ప్రకారం.. ఓడిఎఫ్ క్యాసారం నుంచి ధారూర్ మండలం చింతకుంటకు వెళ్తున్న ప్రైవేట్ బస్సు అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురై బోల్తా పడింది. ఇస్నాపూర్‌లో వెల్డింగ్ పని చేస్తూ నిన్న మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ఆయన బంధువులు బస్సులో చింతకుంటకు బయలుదేరినట్లు సమాచారం. అనంతగిరి ఘాట్ దిగిన అనంతరం ఓ మూలమలుపు వద్ద బస్సు అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పలువురు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే బేరి రామచందర్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నిరుపేద కుటుంబాలపై పెను విషాదం

ప్రమాదానికి గురైన బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ఎక్కువమంది నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారేనని బేరి రామచందర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కుటుంబంలో మరణం సంభవించడంతో అంత్యక్రియలకు వెళ్తున్న బంధువులు తిరిగి తమ ఇళ్లకు చేరుకోలేని పరిస్థితి ఏర్పడటం హృదయ విదారకమని పేర్కొన్నారు. ఈ ప్రమాదం ఆయా కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చిందని, మృతుల కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

మృతుల కుటుంబాలకు వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని బేరి రామచందర్ యాదవ్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక సహాయాన్ని అందించాలని కోరారు. అలాగే గాయపడిన వారికి ఎలాంటి ఆలస్యం లేకుండా మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. క్షతగాత్రులను వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా సమీపంలోని ప్రభుత్వ, అవసరమైతే ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి అత్యవసర వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.

క్షతగాత్రుల వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి

ప్రమాదంలో గాయపడిన వారి కుటుంబాలు ఇప్పటికే తీవ్ర ఆవేదనలో ఉన్నాయని, వైద్య ఖర్చుల భారం కూడా వారిపై పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బేరి రామచందర్ యాదవ్ అన్నారు. క్షతగాత్రుల చికిత్సకు అయ్యే మొత్తం వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించేలా తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రమాదానికి సంబంధించిన కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, భవిష్యత్తులో అనంతగిరి ఘాట్ రోడ్డులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు న్యాయమైన ఆర్థిక సహాయం.. క్షతగాత్రులకు సంపూర్ణ వైద్యం.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవడం తక్షణ అవసరమని బేరి రామచందర్ యాదవ్ స్పష్టం చేశారు.

ప్రజల కోసం అడుగు

పోరాటం కోసం మరొక అడుగు

కూకట్‌పల్లి రాజకీయ ప్రస్థానంలో గొట్టిముక్కల వెంకటేశ్వర రావు......

కూకట్‌పల్లి నిలువుటద్దం ప్రత్యేక కథనం: కూకట్‌పల్లి రాజకీయ, సామాజిక పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే... స్థానిక ప్రజలతో మమేకమై, రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కోసం నిరంతరం ప్రయత్నించిన నాయకుల్లో గొట్టిముక్కల వెంకటేశ్వర రావు పేరు కనిపిస్తుంది. ప్రజా సమస్యలపై స్పందించడం, ఉద్యమాల్లో పాల్గొనడం, రాజకీయంగా తన స్వరాన్ని వినిపించడం వంటి అంశాలతో ఆయన తన ప్రస్థానాన్ని కొనసాగించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేశానని ఆయన స్వయంగా వెల్లడించినట్లు 2023లో పేర్కొన్నాయి.

ఉద్యమం నుంచి రాజకీయాల వైపు...

తెలంగాణ ఉద్యమ కాలంలో క్రియాశీలకంగా పనిచేసిన అనంతరం గొట్టిముక్కల వెంకటేశ్వర రావు కూకట్‌పల్లి ప్రాంత రాజకీయాల్లో తన కార్యకలాపాలను విస్తరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏర్పడిన రాజకీయ పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లో తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేశానని ఆయన పేర్కొన్నారు. కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా యువతతో సమావేశాలు నిర్వహించడం, వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా రాజకీయాల్లో యువత పాత్రపై ఆయన దృష్టి పెట్టినట్లు అప్పటి వార్తా కథనాలు వెల్లడించాయి.

2018లోనే రాజకీయ ఆశయానికి తొలి పెద్ద అడుగు

2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూకట్‌పల్లి నుంచి పార్టీ టికెట్‌ను ఆశిస్తూ ఆయన పాదయాత్ర ప్రారంభించినట్లు 2023లో ఇచ్చిన ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తూ వార్తలు ప్రచురించాయి. అయితే అప్పటి రాజకీయ పరిణామాల నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యేకే టికెట్ ఇవ్వాలని పార్టీ నిర్ణయించడంతో పోటీ నుంచి తప్పుకున్నానని ఆయన తెలిపారు. పార్టీ తనకు తగిన గుర్తింపు ఇచ్చి నామినేటెడ్ పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లు కూడా ఆయన పేర్కొన్నారు.

ఆశయం ఆగలేదు...

అడుగు వెనక్కి పడలేదు...

అవకాశం కోసం ఎదురు చూసినా, రాజకీయ ప్రస్థానం మాత్రం కొనసాగింది.

యువతతో మమేకం... ప్రజలతో అనుబంధం 2023లో కూకట్‌పల్లిలో నిర్వహించిన "యూత్ ఇంటరాక్షన్ విత్ జీవీఆర్" కార్యక్రమం ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రస్తావించదగిన ఘట్టంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువతతో ఆయన ముఖాముఖి నిర్వహించి వారి సలహాలు, సూచనలు స్వీకరించినట్లు వార్తా కథనం పేర్కొంది. రాజకీయాల్లో యువత ప్రభావం పెరుగుతోందని, అందుకే యువత అభిప్రాయాలను తెలుసుకోవడానికి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన చెప్పినట్లు ఆ కథనం తెలిపింది. టికెట్ కోసం పట్టుదల... రాజకీయ భవిష్యత్తుపై స్పష్టమైన సంకల్పం 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూకట్‌పల్లి నుంచి బీఆర్ఎస్ టికెట్ కోసం ఆయన తన ఆకాంక్షను బహిరంగంగా వ్యక్తం చేశారు. టికెట్ లభించకపోతే స్వతంత్రంగా లేదా రెబల్ అభ్యర్థిగా పోటీ చేసే ఆలోచన ఉందని కూడా ఆయన అప్పట్లో ప్రకటించారు. తనకు యువత, మహిళలు, నియోజకవర్గ ప్రజల మద్దతు ఉందని ఆయన చెప్పినట్లు వార్తలు పేర్కొన్నాయి. అదే సమయంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో అక్రమాలు, ఆక్రమణలను అరికట్టి ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే తన ఆలోచనను ఆయన వెల్లడించారు. ఇది ఆయన అప్పటి రాజకీయ అజెండాలో ప్రధానంగా కనిపించిన అంశాల్లో ఒకటి.

2023 ఎన్నికల ముందు రాజకీయ మలుపులు

2023 నవంబర్‌లో వెలువడిన ఒక వార్తా కథనం ప్రకారం, బీఆర్ఎస్ టికెట్ విషయంలో అసంతృప్తి నేపథ్యంలో గొట్టిముక్కల వెంకటేశ్వర రావును కాంగ్రెస్‌లోకి ఆహ్వానించేందుకు ఆ పార్టీ నాయకులు ప్రయత్నించినట్లు సమాచారం వెలువడింది. ఆ సమయంలో ఆయన రాజకీయ భవిష్యత్తుపై కూకట్‌పల్లిలో ఆసక్తికరమైన చర్చ సాగినట్లు ఆ కథనం పేర్కొంది. అయితే ఇలాంటి వార్తల్లోని రాజకీయ అంచనాలను ఆయన జీవిత చరిత్రలో ఖచ్చితమైన నిర్ణయాలుగా పేర్కొనకుండా, ఆ కాలంలోని రాజకీయ పరిణామాలుగా మాత్రమే చూడాలి.

2025లోనూ కూకట్‌పల్లి రాజకీయాల్లో కొనసాగిన ప్రస్థానం

2025లో కూకట్‌పల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం నూతన కమిటీకి సంబంధించిన కార్యక్రమాల్లో కూడా గొట్టిముక్కల వెంకటేశ్వర రావు పాల్గొన్నట్లు స్థానిక వార్తా కథనాలు పేర్కొన్నాయి. దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన కార్యక్రమంలో ఆయనతో పాటు కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు పాల్గొన్నట్లు వార్త ప్రచురితమైంది. అలాగే నూతన దేవస్థాన కమిటీ సభ్యుల పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆయనను సీనియర్ నాయకుడిగా వార్తా కథనం పేర్కొంది.

2026లోనూ ప్రజా కార్యక్రమాల్లో కనిపిస్తున్న పేరు

2026 ఆగస్టులో ఎల్లమ్మబండ గుడ్‌విల్ చౌరస్తా వద్ద జరిగిన ఒక హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వర రావు పాల్గొన్నట్లు స్థానిక వార్తా కథనం పేర్కొంది. దీంతో ఆయన రాజకీయ కార్యకలాపాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కాకుండా, స్థానిక సామాజిక, ప్రజా కార్యక్రమాల్లోనూ కొనసాగుతున్నట్లు పబ్లిక్‌గా లభిస్తున్న తాజా వార్తా సమాచారం సూచిస్తోంది.

పోరాటమే పునాది... ప్రజలే ప్రేరణ...

కూకట్‌పల్లే కార్యక్షేత్రం... గొట్టిముక్కలే ఒక రాజకీయ ప్రయాణం

గొట్టిముక్కల వెంకటేశ్వర రావు జీవిత ప్రస్థానాన్ని పరిశీలిస్తే మూడు ప్రధాన అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి---

ఉద్యమ నేపథ్యం...

రాజకీయ పట్టుదల...

ప్రజలతో నిరంతర అనుబంధం...

తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన వ్యక్తిగా తనను తాను పేర్కొంటూ రాజకీయాల్లోకి వచ్చిన ఆయన, కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తగా, ఆశావహ నాయకుడిగా, సీనియర్ నాయకుడిగా వివిధ దశలను ఎదుర్కొన్నారు. టికెట్ దక్కని సందర్భాల్లోనూ తన రాజకీయ ఆకాంక్షను బహిరంగంగా వ్యక్తం చేయడం, యువతతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించడం, స్థానిక సమస్యలపై తన అభిప్రాయాలను వెల్లడించడం ఆయన రాజకీయ శైలిలో కనిపించిన అంశాలు.

అవకాశం వచ్చినా...

అవకాశం రాకపోయినా...

ఆశయం మాత్రం ఆగకూడదనే భావనతో

తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న నాయకుడిగా

గొట్టిముక్కల వెంకటేశ్వర రావు కూకట్‌పల్లి రాజకీయాల్లో తన ముద్ర కోసం ముందుకు సాగుతున్నారు.

"ఉద్యమం నుంచి రాజకీయానికి...

రాజకీయాల నుంచి ప్రజల మధ్యకు...

ప్రజల మధ్య నుంచి మరో అడుగుకు...

అదే గొట్టిముక్కల వెంకటేశ్వర రావు ప్రస్థానం."

పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

మొదటిపేజీ తరువాయి - అధికారులు ఈ నివేదికను సమర్పించారు. నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ (ర్యూ×) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది. ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష 1300 మంది పోలీసులతో కీలక భేటీ రేపు శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు 1300 మంది అధికారులతో సమావేశం గంజాయి, సైబర్ క్రైమ్, మహిళలపై నేరాల కట్టడిపై ప్రధానంగా చర్చ పోలీస్ స్టేషన్ల పనితీరుపై నివేదికలతో సమీక్షించనున్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు సచివాలయంలో కీలకమైన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ చరిత్రలోనే అరుదుగా, డీజీపీ స్థాయి అధికారి నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,300 మంది అధికారులు ఈ సమావేశంలో పాల్గొనబోతుండటం గమనార్హం. ఈ సమీక్షా సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలోని శాంతిభద్రతలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాలు, గంజాయి నిర్మూలన, బ్లేడ్ బ్యాచ్‌ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడం వంటి కీలక అంశాలపై చంద్రబాబు చర్చించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై తన వద్ద ఉన్న క్షేత్రస్థాయి నివేదికలను అధికారుల ముందుంచి, ఆయన సమగ్రంగా విశ్లేషించనున్నారు. వివిధ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల పర్యవేక్షణ తీరుతెన్నులపై ముఖ్యమంత్రి నేరుగా సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, చట్టాన్ని అతిక్రమించే వారిపై ఉక్కుపాదం మోపాలని, మహిళలు, బలహీన వర్గాల రక్షణకే అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా హాజరవుతుండగా, జిల్లా స్థాయి అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటారు.

చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది

మొదటిపేజీ తరువాయి - చిట్ ఇవ్వడం చారిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఆమె రాసిన ప్రత్యేక వ్యాసంలో... సుప్రీంకోర్టు తీర్పుతో మన్మోహన్ సింగ్‌పై ఇన్నాళ్లూ జరిగిన రాజకీయ కక్షసాధింపులకు, దుష్ప్రచారాలకు తెరపడిందని స్పష్టం చేశారు. "నాడు (2014 జనవరిలో) మన్మోహన్ సింగ్ చెప్పినట్లుగానే చరిత్ర ఆయన పట్ల చాలా దయతో, గౌరవంగా ప్రవర్తిస్తుంది" అని ఆమె గుర్తుచేశారు. సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ నివేదికను ఆమోదిస్తూ, విచారణ పరిధి దాటి వ్యాఖ్యలు చేసిన విచారణ కోర్టు తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని సోనియా గాంధీ స్వాగతించారు. మన్మోహన్ సింగ్ సమగ్రతను, మచ్చలేని రాజకీయాన్ని దెబ్బతీసేందుకు అప్పట్లో రాజకీయ ప్రత్యర్థులు, కొందరు అధికారులు మరియు మీడియా ప్రణాళికాబద్ధంగా కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వంపై మండిపడుతూ... సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. యూపీఏ హయాంలో సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి హామీ, విద్యా హక్కు, ఆహార భద్రత చట్టాల ప్రాధాన్యతను వివరిస్తూ.. మన్మోహన్ సింగ్ ప్రశాంతంగా ఉన్నప్పటికీ దేశానికి అత్యంత కీలకమైన సేవలు అందించిన ప్రధానిగా నిలిచిపోతారని కొనియాడారు.

గురుదక్షిణ సంపాదకులకు తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకుల అభినందనలు

హైదరాబాద్, అక్టోబర్ 03, నిలువుటద్దం ప్రతినిధి: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం విద్యార్థులు సంపాదకులుగా వ్యవహరించి రూపొందించిన "గురుదక్షిణ" కవితా సంకలనానికి తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ఐఏఎస్ అధికారి ఏనుగు నరసింహారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రచురితమైన ఈ కవితా సంకలనం గురువుల ఔన్నత్యాన్ని, వారి సేవలను, విద్యార్థుల జీవితాల్లో గురువుల పాత్రను చాటిచెప్పేలా ఉందని ఆయన ప్రశంసించారు. రవీంద్రభారతి ప్రాంగణంలోని తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుల కార్యాలయంలో "గురుదక్షిణ" కవితా సంకలన సంపాదకులు కొండూరి కోటి బాబు, ఎస్. కళ్యాణ్ దాస్, అంజిబాబు ఫౌండేషన్ ప్రతినిధి నాగుల ఆంజనేయులు (అంజిబాబు) మర్యాదపూర్వకంగా ఏనుగు నరసింహారెడ్డిని కలిసి పుస్తకాన్ని అందజేశారు. సంకలనానికి ముందుమాట రాసి ప్రోత్సహించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సంపాదకులుగా బాధ్యతలు స్వీకరించి ఒక కవితా సంకలనాన్ని తీర్చిదిద్దడం అభినందనీయమని అన్నారు. కేవలం కవితా రచనకే పరిమితం కాకుండా సమాజాన్ని మేలుకొలిపేలా, ప్రజల్లో ఆలోచనలను రేకెత్తించేలా మరిన్ని విలువైన రచనలు చేయాలని సంపాదకులకు సూచించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 60 మంది కవులు గురువు ఔన్నత్యాన్ని ప్రతిబింబించేలా కవితలు రాయడం మంచి పరిణామమని ఆయన పేర్కొన్నారు. గురువు–-శిష్య సంబంధంలోని విలువలను సాహిత్య రూపంలో ఆవిష్కరించిన "గురుదక్షిణ" సంకలనం విద్యార్థుల్లో సృజనాత్మకతకు, సాహిత్య అభిరుచికి అద్దం పడుతోందన్నారు. జర్నలిజం విద్యార్థుల ప్రతిభను ఆదర్శంగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా తమలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వివిధ రంగాల్లో రాణించాలని ఆయన సూచించారు. ప్రతి వ్యక్తిలోనూ కళలు, సృజనాత్మకత, ప్రతిభ దాగి ఉంటాయని, వాటిని వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదర్శవంతమైన రచనలు లక్షలాది మేధస్సులను కదిలించి, సమాజంలో ఆలోచనలకు దారితీసే శక్తిని కలిగి ఉంటాయని ఏనుగు నరసింహారెడ్డి పేర్కొన్నారు. యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించే ఇలాంటి సాహిత్య ప్రయత్నాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్సాహవంతులైన, ప్రతిభావంతులైన ఈ జర్నలిజం విద్యార్థుల నుంచి భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ రచనలు వెలువడాలని ఆయన ఆకాంక్షించారు. "గురుదక్షిణ" కవితా సంకలనం ద్వారా విద్యార్థులు సాహిత్య రంగంలో తమ తొలి అడుగులను సమర్థవంతంగా వేయడం అభినందనీయమని తెలిపారు.

ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు... అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకూడదు!

ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.......

ఐదు నిమిషాలు కేటాయించి ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలి......

కూకట్‌పల్లి, అక్టోబర్ 3, నిలువుటద్దం ప్రతినిధి: మూసాపేట డివిజన్ పరిధిలోని మోతీనగర్ వార్డు కార్యాలయంలో శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎస్ఐఆర్ ఓటరు జాబితా పరిశీలన, నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకోవడంతో పాటు పలు కీలక సూచనలు చేశారు. ఎస్ఐఆర్. ప్రక్రియలో భాగంగా నోటీసులు అందిన ప్రతి ఓటరుకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్క పౌరుడు కూడా ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బి ఎల్ ఓ లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఓటర్లకు అవసరమైన వివరాలు, పత్రాల విషయంలో తగిన సహకారం అందించాలని అన్నారు. "ఓటు ప్రతి పౌరుడికి ఎంతో ముఖ్యమైన హక్కు. ప్రజలు కూడా ా×= ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా కేవలం ఐదు నిమిషాల సమయం కేటాయించి తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలి. ఏమైనా సమస్య ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలి" అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు.మహిళల కోరిక మేరకు కమ్యూనిటీ హాల్ ప్రారంభం ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన అనంతరం మోతీనగర్ ప్రాంతంలోని కబీర్ నగర్‌లో మహిళల కోరిక మేరకు ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండేలా కమ్యూనిటీ హాల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మోతీనగర్ ప్రాంతంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులపై అన్ని విభాగాల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాళా పనులు వేగవంతం చేయాలని ఆదేశం రామారావు నగర్ నుంచి కబీర్ నగర్ వరకు కొనసాగుతున్న నాళా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మోతీనగర్‌లో చేపట్టాల్సిన డివైడర్ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించిన పనులను ఆలస్యం చేయకుండా వెంటనే చేపట్టాలని అన్నారు. అభివృద్ధి పనులు ఆలస్యం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజలకు మౌలిక వసతులే ప్రాధాన్యం

మూసాపేట డివిజన్‌లో ప్రజలకు మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు, డ్రైనేజీ, నాళాలు, డివైడర్లు తదితర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. చేపట్టిన పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, జోసఫ్, తిరుపతి, రాజ్ కుమార్ గౌడ్, ఉదయ్ వినోద్, వెంకట్ రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, అశోక్‌తో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలోనే చిన్నారి పుట్టినరోజు వేడుకలు.. పేదలకు ఆహారం, పండ్ల పంపిణీ

రామచంద్రపురం, నిలువుటద్దం న్యూస్: బీహెచ్ఈఎల్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి బండారు పల్లి లార్మిక పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలోనే నిర్వహించారు. చిన్నారి ఆరోగ్యం సరిగా లేక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ, పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు నిరాడంబరంగా వేడుకలు జరిపారు. చిన్నారి తల్లి రాధ, నాన్న నాగ మురళి, నాన్నమ్మ వరలక్ష్మి, తాత సత్యం కలిసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహారం, పండ్లు పంపిణీ చేసి చిన్నారి పుట్టినరోజు ఆనందాన్ని వారితో పంచుకున్నారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు. తమ కుటుంబ ఆనందాన్ని ఇతరులతో పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. విశ్వకర్మలకు 5 శాతం వాటా!

హైదరాబాద్ నుంచి ఢిల్లీకి 1,770 కి.మీ. మహా పాదయాత్ర ప్రారంభం

జంతర్‌మంతర్ వద్ద బహిరంగ సభ.. ప్రధాని మోదీ, రాహుల్ గాంధీకి వినతిపత్రం.......

హైదరాబాద్, అక్టోబర్ 3, నిలువుటద్దం ప్రతినిధి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు జనాభా ప్రాతిపదికన విశ్వకర్మలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్లతో హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీ వరకు 1,770 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. బీసీలు, విశ్వకర్మల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల కోసం చేపట్టిన ఈ పాదయాత్రకు బీసీ, విశ్వకర్మ సంఘాల నాయకులు, కార్యకర్తలు మద్దతు ప్రకటించారు. హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు పాదయాత్ర చేపడుతున్న రామయ్య ఆచారిని పలువురు నాయకులు అభినందించి, ఉద్యమానికి తమ సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమానికి బీసీ సంఘాల నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ కార్యదర్శి శేఖావళి ఆచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు పుష్పగిరి ఆచారి, జోగులాంబ గద్వాల్ జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు కంచుపాడు రామయ్య ఆచారి సమక్షంలో విశ్వకర్మ జెండాను ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నరేష్ చారి, రవి చారి, బీసీ సంఘం నాయకుడు వడ్ల సుమంత్ ఆచారితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

పాదయాత్ర చేపడుతున్న రామయ్య ఆచారి మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం, రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణలో సుమారు 25 లక్షల మంది విశ్వకర్మలు ఉన్నారని పేర్కొంటూ, తమ జనాభా ప్రాతిపదికన విశ్వకర్మలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలను కోరుతున్నట్లు తెలిపారు.

జంతర్‌మంతర్ వద్ద బహిరంగ సభ

హైదరాబాద్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర వివిధ ప్రాంతాల మీదుగా న్యూఢిల్లీకి చేరుకున్న అనంతరం జంతర్‌మంతర్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రామయ్య ఆచారి తెలిపారు. అనంతరం బీసీ, విశ్వకర్మల రిజర్వేషన్లకు సంబంధించిన డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అందజేయనున్నట్లు వెల్లడించారు.

చేగుంటలో ఘన సన్మానం

పాదయాత్రలో భాగంగా చేగుంట మండలం చేగుంట గ్రామానికి చేరుకున్న రామయ్య ఆచారికి కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ స్రవంతి సతీష్ సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వనాథుల పుష్పగిరి ఆచారి, నరేష్ చారి, రవీందర్ చారిలను కూడా సన్మానించారు. అనంతరం జెండా ఊపి

పాదయాత్రను ముందుకు సాగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, విశ్వకర్మ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని పాదయాత్రకు మద్దతు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, విశ్వకర్మలకు 5 శాతం రిజర్వేషన్ అనే ప్రధాన డిమాండ్లతో సాగుతున్న ఈ పాదయాత్ర ఢిల్లీ వరకు కొనసాగనుంది.

చదువుతో పాటు రాజకీయ చైతన్యం యువత చేతిలోనే మార్పు మాస్టర్ కీ

"ఓట్లు వేసే గొర్రెల్లా కాదు.. రేపటి వ్యవస్థను నడిపించే సింహాల్లా ఎదగాలి.......

ఆత్మకూరు నిలువుటద్దం ప్రతినిధి అక్టోబర్ 3: ప్రభుత్వాల తాట తీసి.. పాలకులను ప్రశ్నించి.. ప్రజల హక్కుల కోసం గళమెత్తే దమ్ము, ధైర్యం యువతకే ఉందని తీన్మార్ మల్లన్న అన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన యువతకు రాజకీయ, సామాజిక చైతన్యంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, "రాజకీయ పవర్‌తోనే ప్రజల జీవితాల్లో అనేక మార్పులు తీసుకురాగలం. యువత చదువుతో పాటు రాజకీయాలపై అవగాహన పెంచుకోవడం కూడా తమ హక్కుగా భావించాలి. మన భవిష్యత్తును ప్రభావితం చేసే అనేక నిర్ణయాలు రాజకీయ వ్యవస్థ ద్వారానే జరుగుతాయి" అని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూచించిన 'మాస్టర్ కీ' భావనను గుర్తుచేస్తూ, రాజకీయ అధికారంలో ప్రజల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువత రాజకీయ వ్యవస్థను అర్థం చేసుకుని, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అన్యాయాలను ప్రశ్నించే ధైర్యాన్ని యువత పెంచుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ప్రభుత్వ నిర్ణయాలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై పాలకులను ప్రశ్నించే బాధ్యత యువతపై ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, జవాబుదారీతనం కోరడం కీలకమని పేర్కొన్నారు.

"జెన్ గ ఉద్యమాలతో ఉరకలెత్తాలి"

ప్రస్తుత +వఙ్గ యువత సోషల్ మీడియాను కేవలం వినోదం కోసం కాకుండా సామాజిక చైతన్యానికి వేదికగా ఉపయోగించుకోవాలని తీన్మార్ మల్లన్న సూచించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అసమానతలు, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించగలదన్నారు. "సోషల్ మీడియాను అల్లాటప్పాగా వాడొద్దు.. సమాజంలో ఉన్న సమస్యలను ప్రశ్నించే వేదికగా మార్చండి" అని విద్యార్థులకు సూచించారు.

ఓటరు నుంచి పాలనలో భాగస్వామి వరకు ఎదగాలి

కేవలం ఎన్నికల సమయంలో ఓటు వేసే స్థాయిలో యువత పరిమితం కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థ ఎలా పనిచేస్తుందో తెలుసుకుని భవిష్యత్తులో పాలనలో భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. "ఓట్లు వేసే గొర్రెల్లా కాదు.. రేపు వ్యవస్థను రూల్ చేసే సింహాల్లా ఎదగాలి" అంటూ విద్యార్థుల్లో రాజకీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాలను నిలదీయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనం కోరాలని అన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. యువత చదువులో రాణించడంతో పాటు సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య చైతన్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటే భవిష్యత్తు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలరని తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో జరిగిన ఈ సమావేశంలో యువత భవిష్యత్తు, రాజకీయ చైతన్యం, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్యంలో యువత

పాత్ర తదితర అంశాలపై ఆయన మాట్లాడారు.

సమస్యలు చెప్పాం.. పరిష్కారానికి బాటలు వేశాం

"ఒకరోజు--ఒక వార్డు" కార్యక్రమంలో నేతాజీ నగర్ సమస్యలపై కమిషనర్‌కు బేరి రామచందర్ యాదవ్ వినతి.......

నల్లగండ్ల, అక్టోబర్ 3, నిలువుటద్దం ప్రతినిధి: ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్న "ఒకరోజు--ఒక వార్డు" కార్యక్రమంలో భాగంగా నల్లగండ్ల 256వ వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సమీక్షా కార్యక్రమం నిర్వహించారు. గుల్మోహర్ కాలనీలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో స్థానిక కాలనీలకు సంబంధించిన మౌలిక వసతుల సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా నేతాజీ నగర్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలంటూ కాలనీ అధ్యక్షులు, బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ జిహెచ్ఎంసి కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీలో చాలాకాలంగా ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

నేతాజీ నగర్ కాలనీలో ప్రధానంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, కాలనీ అంతర్గత మౌలిక వసతులు తదితర అంశాలను వినతి పత్రంలో ప్రస్తావించినట్లు బేరి రామచందర్ యాదవ్ తెలిపారు. కాలనీలోని ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించి, వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని కోరారు.

అధికారులతో క్షేత్రస్థాయి సమీక్ష

"ఒకరోజు--ఒక వార్డు" కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ సమావేశానికి జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తో పాటు

ఇంజనీరింగ్, ఎస్డబ్ల్యూఎం, టౌన్ ప్లానింగ్, యూబీడీ, ఎంటమాలజీ తదితర విభాగాలకు చెందిన సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు హాజరయ్యారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఏల ప్రతినిధులతో కలిసి అధికారులు వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల పరిస్థితి, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాలు, పార్కుల నిర్వహణ తదితర అంశాలపై స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను స్వయంగా పరిశీలించడం ద్వారా వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను గుర్తించారు.

నీటి సంరక్షణకు ఏర్పాటు చేసిన పిట్ పరిశీలన

అదేవిధంగా కాలనీ పార్కులో నీటి సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన పిట్‌ను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే చర్యలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా గుర్తించారు.

సానుకూలంగా స్పందించిన అధికారులు

నేతాజీ నగర్ కాలనీ సమస్యలను కమిషనర్, డిప్యూటీ కమిషనర్, జిహెచ్ఎంసి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సందర్భంగా వారు సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని బేరి రామచందర్ యాదవ్ తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారులు తెలుసుకుని, క్షేత్రస్థాయిలోనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా అధికారులు ప్రతి కాలనీకి చేరుకుని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవడం వల్ల సమస్యల పరిష్కారంలో వేగం పెరుగుతుందని పేర్కొన్నారు.

అధికారులకు ప్రజల తరపున కృతజ్ఞతలు

"ఒకరోజు--ఒక వార్డు" వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న జిహెచ్ఎంసి అధికారులకు ప్రజల తరపున బేరి రామచందర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. నేతాజీ నగర్ కాలనీకి సంబంధించిన సమస్యలు త్వరగా పరిష్కారమై, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కే. నరసింహ యాదవ్, అన్నదొర, దశరథ్ నాయక్, గణేష్ నాయక్, జోషి రాఘవేంద్ర శర్మ, మణికంఠ, ప్రసాద్ తదితరులతో పాటు కాలనీ అసోసియేషన్ సభ్యులు, ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంతగిరి బస్సు ప్రమాద బాధితులకు జీఎంఆర్ అండ

బాధితుల చికిత్స కోసం రూ.2 లక్షలు చెల్లింపు.. వైద్య ఖర్చులు భరిస్తానని హామీ

పటాన్ చెరు, నిలువుటద్దం ప్రతినిధి: అనంతగిరి బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వికారాబాద్‌లోని ఈషా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పటాన్చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన క్షతగాత్రులను పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి.. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రి యాజమాన్యానికి రూ.2 లక్షల మొత్తాన్ని చెల్లించారు. క్షతగాత్రులు పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్య సేవలు అందించాలని, వారిని కంటికి రెప్పలా చూసుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ వైద్యులకు సూచించారు. అవసరమైన వైద్య ఖర్చులను తానే భరిస్తానని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వారికి అండగా నిలుస్తామని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆకాంక్షించారు.

సమస్య పరిష్కారానికి శ్రమించిన బండి రమేష్‌కు ప్రజల ప్రశంసలు

స్వాన్ లేక్ నాలా--అలుగు సమస్యపై అధికారులతో నిరంతర సమన్వయం.......

"సమస్య తీరే వేళ క్రెడిట్ కోసం రావడం సరికాదు" --- గాదె శివ......

కూకట్‌పల్లి నిలువుటద్దం ప్రతినిధి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని స్వాన్ లేక్ అపార్ట్మెంట్‌కు సంబంధించిన నాలా, అలుగు సమస్య పరిష్కార దిశగా చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో, సమస్య పరిష్కారం కోసం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ చేసిన కృషిని స్వాన్ లేక్ అపార్ట్మెంట్ సభ్యులు, కూకట్‌పల్లి ప్రజలు అభినందిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలను గుర్తించి, ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్న బండి రమేష్ చొరవ అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. స్వాన్ లేక్ అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులతో పలుమార్లు సమావేశమై నాలా, అలుగు సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకున్న బండి రమేష్, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు కాంగ్రెస్ నాయకులతో కలిసి అధికారులతో నిరంతరం చర్చలు జరిపారని గాదె శివ తెలిపారు. నాలా విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టేలా అధికారులతో సమన్వయం చేసి, సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేశారని చెప్పారు. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణలో సంబంధిత పనులు కొనసాగుతున్నాయని, సమస్య పరిష్కార దిశగా ముందడుగు పడిందని గాదె శివ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని చెరువుల సుందరీకరణతో పాటు గతంలో ఆక్రమణలకు గురైన ప్రాంతాల పరిరక్షణకు కూడా బండి రమేష్ కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. అయితే, సమస్య పరిష్కార దశకు చేరుకున్న సమయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, సమస్య పరిష్కారమవుతోందని ప్రకటించడం పట్ల తమ అభ్యంతరం ఉందని గాదె శివ తెలిపారు. ప్రజా సమస్య పరిష్కారానికి ఎవరు ఎంత కృషి చేశారో, ఆ కృషికి తగిన గుర్తింపు ఇవ్వడం ప్రజాస్వామ్య సంప్రదాయమని అన్నారు. "గతంలో ఎమ్మెల్యే చేసిన పనులకు ఆయనకు క్రెడిట్ ఉండాలి. అదే విధంగా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తరఫున బండి రమేష్ ప్రజలతో మమేకమై, అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి కృషి చేసిన సమస్యలకు కూడా ఆయన కృషికి తగిన గుర్తింపు ఉండాలి" అని గాదె శివ స్పష్టం చేశారు. స్వాన్ లేక్ అపార్ట్మెంట్ సభ్యులు తమ సమస్యను పలుమార్లు బండి రమేష్ దృష్టికి తీసుకురాగా, ఆయన నిరంతరం వారితో సంప్రదింపులు జరుపుతూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. సమస్య పరిష్కారం దిశగా జరుగుతున్న పనుల పట్ల అపార్ట్మెంట్ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేస్తూ బండి రమేష్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారని గాదె శివ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై కేవలం ప్రకటనలు చేయడం కాకుండా, ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకుని,

అధికారులతో చర్చించి, పరిష్కారం లభించే వరకు నిరంతరం కృషి చేయడమే నిజమైన ప్రజా నాయకత్వానికి నిదర్శనమని ఆయన అన్నారు. ప్రజా సమస్యలను రాజకీయ క్రెడిట్ కోసం కాకుండా ప్రజల ప్రయోజనం కోసం పరిష్కరించేందుకు అన్ని రాజకీయ పక్షాలు కలిసి పనిచేయాలని గాదె శివ విజ్ఞప్తి చేశారు. ప్రజల కోసం పనిచేసే నాయకుల కృషిని ప్రజలే గుర్తిస్తారని ఆయన అన్నారు. స్వాన్ లేక్ నాలా సమస్య పరిష్కారానికి అలుపెరగని కృషి చేస్తున్న బండి రమేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు అని గాదె శివ తెలిపారు.

కాసుల మత్తులో అధికారులు కబ్జాదారుల చేతుల్లో బడి స్థలం!

సప్తగిరి కాలనీలో వందల కోట్ల విలువైన పాఠశాల స్థలంపై కన్ను.......

నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారంటున్న స్థానికులు..

రాత్రికి రాత్రే భారీ షెడ్డు నిర్మాణం

రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులపై చర్యలు కోరుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదుకు సిద్ధం.......

కూకట్‌పల్లి, అక్టోబర్ 3, నిలువుటద్దం ప్రతినిధి: ప్రజలకు విద్యాబుద్ధులు నేర్పే పాఠశాల కోసం కేటాయించిన స్థలమే ఆక్రమణకు గురవుతోందన్న ఆరోపణలు కూకట్‌పల్లి సప్తగిరి కాలనీలో కలకలం రేపుతున్నాయి. విద్యా అవసరాల కోసం కేటాయించిన విలువైన స్థలాన్ని పరిరక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండానే భారీ షెడ్డు నిర్మాణం చేపడుతున్నారని, రాత్రివేళల్లో పనులు వేగంగా కొనసాగిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

పాఠశాల కోసం కేటాయించిన 1100 గజాల స్థలం

స్థానికుల వివరాల ప్రకారం.. సప్తగిరి కాలనీ వెంచర్‌లో సుమారు 1100 గజాల స్థలాన్ని పాఠశాల అవసరాల కోసం కేటాయించారు. ఈ స్థలంలో 2025 వరకు పాఠశాల కూడా కొనసాగినట్లు వారు చెబుతున్నారు. ప్రస్తుతం పాఠశాల కార్యకలాపాలు నిలిచిన నేపథ్యంలో ఆ స్థలంపై కొందరు వ్యక్తులు కన్నేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలు

సదరు స్థలాన్ని 2006లోనే మహమ్మద్ మహబూబ్ అలీఖాన్ అనే వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు చూపించే పత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని ప్లాట్ నంబర్లు 267/1, 267/2, 268/1, 268/2గా విభజించి ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై చూపించేందుకు ప్రయత్నాలు జరిగాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పత్రాలు నిజమైనవేనా? స్థలానికి సంబంధించిన అసలు రెవెన్యూ రికార్డులు ఏమి చెబుతున్నాయి? రిజిస్ట్రేషన్‌కు ఆధారమైన పత్రాలు చట్టబద్ధమైనవేనా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రీన్ మ్యాట్ల ముసుగులో.. రాత్రికి రాత్రే భారీ షెడ్డు!



వివాదాస్పద స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్డు నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు బయటకు కనిపించకుండా చుట్టూ గ్రీన్ మ్యాట్లు, పరదాలు ఏర్పాటు చేసి, రాత్రివేళల్లో పనులు వేగంగా కొనసాగిస్తున్నారని చెబుతున్నారు. ఇంత పెద్ద నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ ప్రాతిపదికన మంజూరు చేశారు? భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తున్నారా? అన్న విషయాలను అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు.

ప్రైవేట్ బౌన్సర్లతో అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు

స్థలాన్ని ప్రశ్నించేందుకు లేదా పరిశీలించేందుకు వచ్చే కాలనీవాసులను అడ్డుకునేందుకు ప్రైవేట్ బౌన్సర్లను ఏర్పాటు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ ప్రాంతంలోనే పాఠశాల కోసం కేటాయించిన స్థలంపై ఏం జరుగుతుందో తెలుసుకునే హక్కు తమకు ఉందని వారు పేర్కొంటున్నారు.

ఫిర్యాదులు చేసినా చర్యలు లేవంటున్న స్థానికులు

స్థల ఆక్రమణ, నిర్మాణ పనులపై ఆధారాలతో సంబంధిత రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తమ ఫిర్యాదులపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు కోరుతున్నారు.

హైడ్రాకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం

కిందిస్థాయి అధికారుల స్పందనపై అసంతృప్తితో ఉన్న సప్తగిరి కాలనీ వాసులు ఈ వ్యవహారంపై హైడ్రా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పాఠశాల కోసం కేటాయించిన స్థలం ప్రభుత్వ/ప్రజా ప్రయోజనానికి సంబంధించినదైతే దానిని తక్షణమే గుర్తించి పరిరక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే వెంటనే పనులు నిలిపివేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ రికార్డులు, లేఅవుట్ అనుమతులు, నిర్మాణ అనుమతులపై సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

"బడి స్థలం కాపాడాలి.. నిజాలు బయటపెట్టాలి"

పాఠశాల కోసం కేటాయించిన స్థలం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందా? రిజిస్ట్రేషన్‌కు ఉపయోగించిన పత్రాలు చట్టబద్ధమైనవేనా? నిర్మాణానికి ఎవరు అనుమతులు ఇచ్చారు? ఫిర్యాదులు వచ్చినా అధికారులు ఎందుకు స్పందించలేదు? అనే ప్రశ్నలకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. స్థలంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచడంతో పాటు, తప్పిదాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సప్తగిరి కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

పదవి లేకున్నా ప్రజాసేవకు పెద్దపీట

మాట ఇచ్చినా వెనక్కి తగ్గని బాట!

రూ.7 లక్షల సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం.......

చిట్టి ఉమేష్ సేవకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రశంసలు

ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా ప్రజల ఇబ్బందులకు సొంత నిధులతో పరిష్కారం......

తెల్లాపూర్, అక్టోబర్ 03 నిలువుటద్దం ప్రతినిధి: ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని నిరూపిస్తూ సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్ నగర్ (ఆస్మాన్ నగర్) మాజీ కౌన్సిలర్ అంతగిరిపల్లె చిట్టి ఉమేశ్వర్ (చిట్టి ఉమేష్) చేపట్టిన సేవా కార్యక్రమం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు బాధ్యతగా ముందుకు వస్తూ, కాలనీ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు తన సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉస్మాన్ నగర్ పరిధిలోని బి-మ్యాక్ సొసైటీ కాలనీలో సరైన రోడ్డు సదుపాయం లేక స్థానిక ప్రజలు చాలా కాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని చిట్టి ఉమేశ్వర్ గుర్తించారు. వర్షాకాలంలో రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా మారడం, రాకపోకలకు ఇబ్బందులు కలగడం, వాహనదారులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. ప్రభుత్వ నిధులు మంజూరయ్యే వరకు వేచి ఉండకుండా, సుమారు రూ.7 లక్షలను తన సొంత నిధుల నుంచి వెచ్చించి సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడం విశేషంగా నిలిచింది. ప్రజా అవసరాన్ని గుర్తించి వ్యక్తిగతంగా నిధులు సమకూర్చి మౌలిక వసతుల కల్పనకు ముందుకు రావడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన మాట... నిలబెట్టుకున్న బాట

తాను కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో బి-మ్యాక్ సొసైటీ కాలనీ ప్రజలకు రోడ్డు సమస్యను పరిష్కరిస్తానని చిట్టి ఉమేశ్వర్ హామీ ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ఆ హామీని మరచిపోకుండా, ప్రజల సమస్యను తన సమస్యగా భావించి సొంత ఖర్చుతో రోడ్డు నిర్మాణానికి ముందుకు రావడం పట్ల స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. "పదవి ఉన్నప్పుడే ప్రజాసేవ చేయాలి అనేది కాదు... ప్రజల మధ్య ఉన్నంతకాలం సేవ చేయాలనే సంకల్పం ఉండాలి" అనే విధంగా ఆయన చర్య నిలిచిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

చిట్టి ఉమేశ్వర్ చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజల ఇబ్బందులను గుర్తించి, తాను కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి సొంత నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ప్రజా ప్రతినిధిగా పనిచేసిన అనుభవాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగిస్తూ, పదవిలో లేకపోయినా ప్రజల అవసరాలకు స్పందించడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రశంసించినట్లు సమాచారం.

స్థానికుల ఇబ్బందులకు ఉపశమనం

బి-మ్యాక్ సొసైటీ కాలనీలో రోడ్డు సదుపాయం మెరుగుపడటంతో స్థానికంగా రాకపోకలు సులభతరం కానున్నాయి. సీసీ రోడ్డు నిర్మాణంతో వర్షాల సమయంలో బురద, గుంతలు వంటి సమస్యలు తగ్గడంతో పాటు వాహనాల రాకపోకలకు కూడా మెరుగైన సౌకర్యం కలుగుతుందని కాలనీ వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, సమస్య పరిష్కారం కోసం ముందుకు వచ్చిన చిట్టి ఉమేశ్వర్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సోషల్ మీడియాలోనూ ప్రశంసల వెల్లువ

చిట్టి ఉమేశ్వర్ తన సొంత నిధులతో రూ.7 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం చేపట్టిన విషయం స్థానికంగా మాత్రమే కాకుండా సోషల్ మీడియాలోనూ చర్చకు వచ్చింది. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల కోసం తన వంతు సహకారం అందించడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజా జీవితంలో పదవి, అధికారం కంటే ప్రజల సమస్యల పట్ల స్పందించే మనస్తత్వమే ముఖ్యమని ఈ ఘటన మరోసారి చాటిచెప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రజా అవసరమే ప్రాధాన్యం... సేవే లక్ష్యం

ఒక కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయం కోసం ప్రభుత్వ నిధుల కోసం మాత్రమే ఎదురుచూడకుండా, తన సొంత నిధులను ఖర్చు చేసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం చిట్టి ఉమేశ్వర్ సేవా దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు పేర్కొన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంతో పాటు ప్రజల సమస్య పరిష్కారంలో తన వంతు బాధ్యతను నిర్వర్తించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజలకు ఇచ్చిన మాటకు విలువ... ప్రజా సమస్యకు పరిష్కారమే లక్ష్యం... పదవి లేకున్నా ప్రజల ౹ ఒక ప్రత్యేక ఉదాహరణగా నిలిచింది.

ప్రభుత్వ పాఠశాలలపై డిఈఓ నిఘా లోపం

- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు... ఆందోళనలో విద్యార్థులు..
- విద్యార్థులకు ప్లే గ్రౌండ్ లేదంటున్న తల్లిదండ్రులు...
- శేరిలింగంపల్లిలో పుట్టగొడుగుల ప్రైవేట్ పాఠశాలలు..
- డిఈఓ.ఎంఈఓ లపై ఆకస్మిక తనిఖీలు అవసరం..
- గల్లీలలో అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలు
- కలెక్టర్ గారు ఆకస్మిక తనిఖీలు చేయగ తప్పదు ఇక...

నిలువుటద్దం అక్టోబర్ 3 : శేరిలింగంపల్లి ప్రతినిధి: ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణ బోధన సక్రమంగా జరగడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం. సమస్యలలో శేరిలింగంపల్లి. మహేశ్వరం. శంకర్ పల్లి. ఆఫీస్ పెట్ మాదాపూర్ నియోజకవర్గాలలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అగమ్య గోచరంగ తయారైందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందలేకపోవడంతో చదువుల్లో వెనుకంజలో ఉన్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలాలు కూడా లేదని. వీటికి తోడుగా ఆటల కోసం వాలీబాల్ ఫుట్బాల్ ఇతర పరికరాలు లేకపోవడంతో విద్యార్థులకు గేమ్స్ సర్టిఫికెట్లు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లా అధికారుల నిర్లక్ష్యమే విద్యార్థుల చదువుకు ఆటంకాలు...

విద్యార్థుల చదువులకు ఆటంకాలు కరిగించేదే జిల్లా విద్యాధికారులని తల్లిదండ్రులు దుయ్యబట్టారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతో చదువుకోవడానికి పుస్తకాలు దొరకడం గగనమైందన్నారు. ఇలాంటి సమస్యలే విద్యార్థులు చదువులకు ఆటంకాలుగా ఎదురవుతున్నాయి. కొంతమంది ప్రతిపక్ష పార్టీ నాయకులు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి కాపీలు, ప్రధానం చేస్తుంటారు. అలాంటి సమయాలలో వారి పైన కూడా కొంతమంది రాజకీయ నేతలు అబండాలు మోపుతారని తెలిసింది.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు ఎక్కడ..?

కొన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దుమ్మా కొట్టి 15 రోజులు నెలకోసారి వచ్చి హాజరు వేసుకుంటున్నట్లు విశ్వాసం నీయ సమాచారం. కొంతమంది పాఠశాల ఉపాధ్యాయులు 11 నుండి 12 గంటల సమయంలో పాఠశాలకు వస్తుంటారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో అంటేనే ఉపాధ్యాయులకు ఎప్పుడు పోయినా ఎవరడుగుతారని భావన కలిగిందని తెలుస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. నియోజకవర్గంలోని లింగంపల్లి బ్రిడ్జి దగ్గర ఉన్న జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సరైన భోజన వసతులు కల్పించలేకపోవడం. ఆటల కోసం స్థలం ఉన్న ప్లే గ్రౌండ్ కూడా కనిపించని దృశ్యాలు సాక్షాత్తుగా దర్శనమిస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

శేరిలింగంపల్లిలో అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలు.. పట్టించుకోని డిఇఓ. ఎంఈఓ.

శేరిలింగంపల్లి నియోజక వర్గంలో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలో ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారని విశ్వాసనీయ సమాచారం. ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్ల వెలసిన నియోజకవర్గ డీఈవో పర్యవేక్షణ

కరువైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కువ శాతం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎలాంటి అనుమతులు లేకుండా. విద్యార్థుల దగ్గర వేలు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న పట్టించుకున్న దాఖలాలు కరువయ్యయన్నారు. కొన్ని పాఠశాలలలో త్రాగునీటి వసతి. మూత్రశాలలు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు సమాచారం.

సీఎం సార్. ప్రభుత్వ ప్రైవేటు. పాఠశాలల పై నిఘా పెట్టండి..

నియోజకవర్గంలోని ప్రైవేట్. ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని. ఈ విషయమై సంబంధిత రంగారెడ్డి జిల్లా డివోలు చర్య తీసుకోకపోవడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

Printed, Published and owned by Y. Ramadevi on behalf of NAGAPUBLICATIONS and printed of Koushik Printers, Vidya Nagar, Hyderabad
Published.... 3/5, MIG Flats, KPHB, Hyderabad 500072, Editor Y. Nagaraju, Ph. No. 9059548848 RNI:APTEL/2001/14027